కథ

# నేనూ గుండు గీయించుకుంటా

## వై.సి.పి. వెంకటరెడ్డి

"ఢిల్లీకి పోదాం! ఢిల్లీకి పోదాం!"అంటూ చెవిలో యిల్లు కట్టుకుని రొదచేస్తూ ఉంటే ఆ రొద భరించలేక ఓ రోజు పచ్చజెండా ఊపాను.

వెంటనే రైల్వేస్టేషనుకెళ్లి రెండు టికెట్లు బుక్ చేశాడు.

రొదచేసింది, బుక్ చేసింది మిత్రుడు రామనాథమే.

ఎంతవుతుందో ఏమో అనుకుంటున్న నేను టికెట్ చూసి చిటికేసి, ఎగిరి గంతేసినంత పన్జేశాను.

ధర్మవరం నుండి న్యూఢిల్లీకి ఒక్కో ప్రయాణికునికి మూడువందల ముప్పై రూపాయులే. రెండువేల రెండు వందలు పై చిలుకు కిలోమీటర్లున్న ఢిల్లీకి అంత తక్కువ చార్జీ ఏమిటని అనుకొంటే పప్పులో కాలేసినట్లే! అందరికీ ఆ సౌకర్యం లేదండోయ్, సీనియర్ సిటిజన్సుకు మాత్రమే యీ రాయితీ.



టికెట్ తాలూకు ఫొటోస్టాట్ కాపీ జేబులో ఉంచుకొని ఎదురుపడ్డవారికల్లా చూపి, ఫలానా రోజు ఢిల్లీకి వెళ్తామంటూ డప్పు వాయించకనే దండోరా వేయసాగాడు మిత్రుడు.

రైల్లో ప్రయాణించేటప్పుడు తినడానికి 'అది కావాలి యిది కావాలి!' అంటూ యింట్లో వారిని సతాయించి తినుబండారాలు సిద్ధం చేయించుకొన్నాడు.

రైలెక్కించి, వీడ్కోలు చెప్పడానికి రామనాథం భార్య, కొడుకు, కోడలు, నా శిష్యుడు వెంగముని మాతోబాటు స్టేషను కొచ్చారు.

"మా ఆయన ఆరోగ్యం అంతంత మాత్రమే, విరేచనాలు పిలిస్తే పలుకుతాయి, జాగర్తగా చూసుకోండన్నయ్యా!" అంది రామనాథం భార్య లక్ష్మీదేవి.

"నీకు భాషరాదు, అనవసరంగా మాట్లాడకు. ఇవిగో యీ మాత్రలు జాగ్రత్తగా ఉంచుకో ఏ జబ్బుకు ఏది మింగాలో కవర్ల మీద రాశాను." అన్నాడు రామనాథం కుమారుడు ఓ పొట్లం అతడి చేతిలో పెడుతూ.

"సూటుకేసు తాళం చేతులు తీసుకొన్నారా మామయ్యా?" అంది రామనాథం కోడలు.

లాల్చీజేబులు, బనియను జేబు, డ్రాయరు జేబు తడిమి, 'లేదే' అన్నాడు కంగారు పడిపోతూ.

అరగంటలో రైలు రాబోతోంది. ఏం చేయాలో పాలుపోలేదు.

"ఆక్సా బ్లేడుచే తాళం కోసేయచ్చు" అన్నాడు నా శిష్యుడు.

ఉరుకులు పరుగులు ప్రారంభమయ్యాయి.

ఆక్సా బ్లేడుతోబాటు మరో తాళం

తెచ్చి, ముందువేసిన తాళం కోసేసి, కొత్తతాళం వేసి, "ఇదిగో తాళం చేతులు!" అంటూ తండ్రి చేతికి యివ్వబోయి, "వద్దులే మామయ్యగారి చేతికిస్తాను." అంటూ నా చేతికిచ్చాడు రామనాథం కుమారుడు.

రైలొచ్చింది.

మా కంపార్టుమెంటు వెదికి, సీట్లలో మమ్మల్ని కూచోబెట్టి రెండు సూటుకేసుల్ని ఓ చైనుతో కలిపి, తాళం వేసి వీడ్కోలిచ్చి దిగిపోయాడు.

చెవులు బద్దలయ్యేలా ఓ కూత కూసి కదిలింది రైలు.

మా పక్కన మరో ప్రయాణికుడు కూచున్నాడు.

ఓ స్టేషన్లో ఆగింది రైలు.

"ఏ స్టేషనిది?" అడిగాడు రామనాథం పక్కనున్న ప్రయాణికుణ్ణి.

"ఏనందిరి?" అన్నాడతడు.

తల వంకించాడు రామనాథం.

మరోగంట పరిగెత్తి ఆగింది రైలు.

"ఇదే స్టేషను?" ప్రశ్నించాడు రామనాథం.

"ఏనందిరి?" అన్నాడు సహ ప్రయాణికుడు.

"అది చిన్న ఏనందిరి, యిది పెద్ద ఏనందిరి." గొణుక్కున్నాడు రామనాథం.

నేను నవ్వుకున్నాను.

మళ్లీ రైలాగడము, రామనాథం ప్రశ్నించడము, తోటి ప్రయాణికుడు 'ఏనందిరి' అనడము యథాప్రకారంగా జరిగిపోయాయి.

"నాకు తెలీదని నోటికొచ్చిన కూత కూస్తావా? అన్నీ ఏనందిర్లేనా వెధవా? రెండు తగిలిస్తే గాని నీ పొగరణగదు." అంటూ చెయ్యి పైకెత్తాడు రామనాథం.

"వడీబేడ్రీ" అన్నాడు తోటి ప్రయాణికుడు చేతులు జోడించి.

అతడు సౌమ్యుడులా ఉన్నాడు. లేకపోతే నా మిత్రుడి చెంప చెళ్లుమనాల్సింది.

"దెబ్బకు దెయ్యం వెరుస్తుంద"ని ఊరికే అన్నారా పెద్దలు! అప్పుడే కూయుచ్చుగదా 'వడీబేడ్రీ' అని" అన్నాడు రామనాథం ఆవేశంగా.

"ఏమిటి గొడవ రామనాథం?" అన్నాను నవ్వుతూ.

"ఏంది మామా, నీకు నవ్వులాటగా ఉందా?"

"విషయం చెప్పకుండా ఊరికే ఆవేశపడిపోతావే!"

"రైలు మూడు స్టేషన్లలో ఆగిందా లేదా?"

భర్త చనిపోయిన స్త్రీని 'విధవ'అంటారు. 'విధవ'కు 'వెధవ'కు ధ్వని స్వామ్యం ఉంది గదా? భార్య చనిపోయిన మగావాణ్ణి వెధవ అనొచ్చా?" అన్నాను.
"ఏమో నాకేం తెలుసు; చదువుకొన్న వాడివి నీకే తెలుసు."

"ఆగింది."

"ఆగినప్పుడల్లా అడిగాను యిది ఏ స్టేషనని. మూడుసార్లూ 'ఏనందిరి' అన్నాడు. కోపమొచ్చి కొట్టడానికి చెయ్యెత్తితే 'వడీబేడ్రీ' అన్నాడు. అప్పుడే కూయుచ్చు గదా 'వడీబేడ్రీ' అని."

"ఇప్పుడయినా అతడి మాటలు నీ కర్థమయ్యాయా?"

"ఎందు కర్థం కాలా ?"

"ఏ మర్థమయింది?"

"ఈ స్టేషన్ 'వడీబేడ్రీ' పోయిన రెండూ ఏనందిర్లు."

పకపక నవ్వాను.

"ఎందుకు నవ్వుతావు? వీడికి పట్టిన పిచ్చి నీకూ పట్టిందా?"

"మాకేం పిచ్చిలేదు. నువ్వు చెయ్యెత్తితే కొడతావని 'వడీబేడ్రీ' అన్నాడు. అంటే 'కొట్టద్దండీ' అని. నువ్వేమడిగావో అర్థం గాక 'ఏనందిరి' అన్నాడు. అంటే 'ఏమంటిరి' అని. ఒకరి భాష మరొకరికి అర్థంగానందువల్ల వచ్చిన చిక్కిది. అందుకే దేశానికంతటికీ ఓ అనుసంధాన భాష ఉండాలని మహాత్మాగాంధీ ఏనాడో అన్నారు. ఆయన ప్రభోదంతో ప్రేరణ పొంది హిందీ నేర్చుకోవాలనుకొన్నాం. నేను నేర్చుకున్నాను. నువ్వు మధ్యలోనే మానుకున్నావు" అన్నాను ఉపన్యాసధోరణిలో.

"ఈయన మాట్లాడింది హిందీయేనా?"

"కాదు, కన్నడం."

"మరి హిందీ నేర్చుకొంటే కన్నడం అర్థమవుతుందా?"

"ఆప్ హిందీ జానతేహైఁ క్యాసాబ్? మైతో అచ్ఛీ తరహ్ జానతాహుఁ!" అన్నాడు తోటి ప్రయాణికుడు కల్పించుకుని.

"చూడు వీరికి హిందీ తెలుసు. నువ్వు హిందీలో అడిగి ఉంటే సమస్య వచ్చేది కాదు. ఇతణ్ణి 'వెధవ' అన్నావు. ఆ పదానికి అర్థం తెలుసా?"

"ఎందుకు తెలీదు. వెయ్యేళ్లు ధనంతో వర్థిల్లమని మనం ఎలిమెంటరీ స్కూల్లో చదివేటప్పుడు అనుకొనేవాళ్లంగదా!"

"అది వ్యంగ్యార్థం. భర్త చనిపోయిన స్త్రీని 'విధవ'అంటారు. 'విధవ'కు 'వెధవ'కు ధ్వని స్వామ్యం ఉంది గదా? భార్య చనిపోయిన మగావాణ్ణి వెధవ అనొచ్చా?" అన్నాను.

"ఏమో నాకేం తెలుసు; చదువుకొన్న వాడివి నీకే తెలుసు."

" భార్య చనిపోయిన పురుషుణ్ణి ఏమనాలో ఏ శబ్దకోశంలోనూ రాయలేదట."

"ఎవరన్నారు?"

"కుందనిక కపాడియాగారు."

"వాడెవడు?"

"దురుసుగా మాట్లాడకపోతే సౌమ్యంగా మాట్లాడచ్చుగదా! కుందనిక కపాడియా గారు ప్రముఖ గుజరాతీ రచయిత్రి. ఆరు అవార్డులు పొందిన ఆమె నవల 'సాత్ పాగ్లన్ ఆకాష్ మాన్'లో ఆ మాట రాసింది."

"రాయకపోవడానికి కారణం కూడా రాసిందా?"

"రాసింది."

"డిక్షనరీలు తయారుచేసింది పురుషులే కాబట్టి తమను కించబరిచే పదాల్ని అందులో చేర్చలేదట. పైగా పురుషుడు పునర్వివాహం చేసుకుంటాడు కాబట్టి అలాంటి పదాలతో పనిలేదని రాయలేదట."

"ఇప్పుడు విధవలూ పెళ్లి చేసుకుంటున్నారు కాబట్టి ఆ పదాన్ని డిక్షనరీలోంచి తొలగిస్తే సరిపోదూ?"

"తొలగించాల్సింది పదాన్ని



కాదు."

"దేన్ని తొలిగించాలి మరి?"

"దేశంలో వితంతువుల్ని లేకుండా చేయాలి."

"అయితే వాళ్లను చంపనన్నా చంపాలి లేదా దేశంనుంచి తరిమేయనన్నా తరిమేయాలి."

"అది సమస్యకు పరిష్కారం కాదు గదా?"

"మరి పరిష్కారమేదంటావ్?"

"వితంతువులందరికీ పునర్వివాహం చేయాలి."

"పునర్వివాహం చేసుకోడానికి వితంతువులందరూ అంగీకరిస్తారంటావా?"

"మార్పులను వ్యతిరేకించేది స్త్రీలే కాబట్టి వారిని అంగీకరింపజేసే బాధ్యత వారికే అప్పజెప్పితే సరిపోతుంది."

"మహిళల్ని మార్చడం మన తరమా? మామా, ఓ విషయం నువ్వు గమనించావో లేదో"

"ఏ విషయమంటావ్?"

"చంకలో బిడ్డనెత్తుకున్న నిండు గర్భిణి ఆపసోపాలు పడుతూ బస్సెక్కి కూచోడానికి సీటులేక సర్దుకోమని బతిమాలినా ఆమెకు సీటివ్వడానికి ఆడాళ్లెవరూ సుముఖత చూపరు. మగవాళ్లలోనే ఎవరో ఒకరు లేచి నిల్చొని తన సీటులో ఆమెను కూచోబెడతారు" అన్నాడు రామనాథం ఫిర్యాదు చేస్తున్న ధోరణిలో.

"నీ మాట పూర్తి నిరాధారమైనదని కొట్టి పారేయడానికి వీల్లేదనుకో. అయితే పురుషులంతా ఉదార స్వభావులే అనుకోవడం ఎంత అనుచితమో స్త్రీలంతా సంకుచిత స్వభావం కలవారే అనుకోవడమూ అంతే అనుచితం" అన్నాడు.

దిగిపోయే వాళ్లకు వీడ్కోలు చెబుతూ, కొత్తగా వచ్చిన వారికి ఆహ్వానం పలుకుతూ, రకరకాల సమస్యల మీద వాదవివాదాలు చేస్తూ, నిద్రొచ్చినప్పుడు నిద్రపోతూ ముప్పై ఆరుగంటలు గడిపేసి న్యూఢిల్లీ స్టేషన్లో దిగాం.

మా కోసం ఎదురుచూస్తున్న మా అబ్బాయి మమ్మల్ని యింటికి తీసుకువెళ్లాడు.

మరునాడు ఉదయం ఆరుగంటలకే బయల్దేరి టూరిస్టు బస్సులో ఆగ్రా వెళ్లడానికి సిద్ధమయ్యాం.

దాదాపు తొమ్మిది గంటల సమయంలో ఒకచోట మా బస్సు ఆగింది.

అందరూ దిగుతూ ఉంటే మేమూ దిగాం బస్సెందుకాపారో అర్థంగాక.

ఆరుబయట బల్లలు, కుర్చీలు అమర్చిన హోటలది.

రెండు ప్లేట్లు ఇడ్లీ, వడ,టీలకు ఆర్డరిచ్చి ఇరవై రూపాయలునోటు యివ్వబోయాను.

"ఫిఫ్టీ ఫైవ్ జీరో!" అన్నాడు నన్ను వెక్కిరిస్తున్నట్లు.

యాభైరూపాయలనోటు అతడి చేతికిచ్చి, అతడిచ్చిన రెండు రశీదులు తీసుకొని, 'నాలుగిడ్లీలు, రెండు వడలు, రెండు టీలకు యాభై రూపాయలంటే అవెంత పెద్దగా ఉంటాయో, మేం యిద్దరమూ పూర్ ఈటర్సేమే!' అనుకుంటూ వెళ్లి రశీదులు సర్వర్ చేతికిచ్చాను.

ఒక్కో ప్లేటులో రెండు ఇడ్లీలు, ఒకవడ, సాంబారు వేసి ఓ చీటి తిరిగి నాచేతికిచ్చి పక్కకు చూపించాడు.

ఇడ్లీ వడల సైజు చూసి మూర్ఛపోయినంతపనైంది.

ఆర్నెల్ల బిడ్డ అరచేయంతున్నాయి ఇడ్లీలు; అదే సైజులో వడలూను.

ఫరారీలో ఉన్నప్పుడు పోలీసులకు దొరక్కుండా చంబల్ లోయలో గడిపి తరువాత యిక్కడ సెటిలై పోయిన వీళ్లు హోటలు నడుపుతున్నారు కాబోలు అనుకున్నాను.




రెండిడ్లీలు, ఓ వడ గబుక్కున నోట్లో కుక్కుకొని, గుటుక్కున మింగేసి, టీతాగి కాళ్లీడ్చుకుంటూ బస్సులో కెళ్లి సీట్లలో కూలబడ్డాం.

ఆగ్రాలోను, బృందావనంలోను చూడదగిన ప్రదేశాలు చూసి రాత్రి పన్నెండు గంటలకు యిల్లు చేరుకున్నాం.

మరునాడు ఉదయం ఏడుగంటలకల్లా కాఫీ తాగి, "షేవింగు చేయించుకొని వస్తా!" అంటూ బయలుదేరబోయాడు రామనాథం.

"నీకు హిందీ రాదే, ఏంచేస్తావు?" ధర్మసందేహం వెలిబుచ్చాను.

"రాకపోతే ఏం సైగల్తో పనిచేసుకొస్తా!" అంటూ వెళ్లిపోయాడు.

నేను నా మనుమడితో మాట్లాడుకొంటూ ఉండిపోయాను.

ఎనిమిదయింది రామనాథం రాలేదు.తొమ్మిదయింది. అతడి ఆచూకీ లేదు. పదయినా రాకపోయేసరికి విరేచనాలేమైనా ప్రారంభమయ్యాయేమో అన్న అనుమానం కలిగింది.

"మీ మిత్రుడేమైపోయాడో వెళ్లి చూడకూడదా మామయ్యా?" అంది కంగారుగా మా కోడలు.

"ఏమీ అయిపోడు. కాకపోతే భాషరాదు కాబట్టి షేవింగు బదులు గుండుగీయించుకొని వచ్చినా రావచ్చు." అన్నాడు మా కుమారుడు.

అంతలోనే ఊడిపడ్డాడు రామనాథం తలకు టవలు చుట్టుకొని.

"గుండెందుకు గీయించుకున్నావో?" అడిగాను.

"వెంట్రుకలు దట్టంగా ఉంటే తలస్నానం చేయడం కష్టం కదా! అందుకే గుండు గీయించుకున్నాను" అన్నాడు నవ్వుతూ.

"అబద్ధాలెందుకు చెబుతారు మామగారూ, లాంగ్వేజ్ ప్రోబ్లమ్ గుండు రూపంలో ప్రత్యక్షమవుతుంది" అన్నాడు మా కుమారుడు.

మౌనంగా ఉండిపోయాడు రామనాథం.

"యింట్లో వాళ్లడిగితే ఏం చెబుతావ్?" అన్నాను.

"ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికామాటలాడి అని అప్పుడప్పుడు నువ్వే చెప్పేవాడివి గదా!" అన్నాడు.

తిరుగు ప్రయాణంలో అవాంతరాలేవీ లేకుండా క్షేమంగా యిల్లు చేరుకున్నాం.

"ఎందుకు గుండు గీయించుకున్నావ్?" అని అడగనే అడిగింది రామనాథం భార్య లక్ష్మీదేవి.

"తిరిగి ప్రయాణమయ్యే వరకు ఏ విధమైన అవాంతరాలు, అనారోగ్యం కలుగకుండా కాపాడితే శ్రీకృష్ణుడి సన్నిధిలో గుండు గీయించుకొంటానని మొక్కుకొన్నా! ఆరోగ్యం చెడకుండా అవాంతరాలు కలుగకుండా కాపాడాడు ఆ వెన్నదొంగ. అందుకే బృందావనంలోని శ్రీకృష్ణుడి సన్నిధిలో గుండు గీయించుకొన్నాను"అన్నాడు రామనాథం ఏ మాత్రం తడబడకుండా.

"నిన్ను క్షేమంగా యిల్లు చేర్చిన బృందావనంలోని ఆ సామిని దర్శించుకుని నేనూ గీయించుకుంటా గుండు" అంది రామనాథం భార్య భక్తి పారవశ్యంతో కళ్లు మూసుకొని.

ఊసరవెల్లి రంగుల్లా మారుతున్న రామనాథం ముఖాన్ని ఆమె గమనించలేదు.

●